క్లుప్తంగా

ఆన్‌లైన్ కోసం లబ్ధిదారుల బారులు



వివరాలను నమోదు చేయించుకుంటున్న విద్యుత్ వినియోగదారులు

దుబ్బాక: గృహజ్యోతి పథకం ఆన్‌లైన్ నమోదు కోసం లబ్ధిదారులు ఆన్‌లైన్ నమోదు కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారు. ఉచిత విద్యుత్ కోసం వినియోగాదారులు తమ రేషన్, ఆధార్, మొబైల్ నంబర్లను విద్యుత్ మీటర్ నంబర్‌తో అనుసంధానం చేసుకోవాలని ప్రభుత్వం సూచించడంతో దుబ్బాకలో విద్యుత్ వినియోగాదారులు ఆన్‌లైన్ చేసుకోవడం కోసం పరుగులు తీస్తున్నారు. ఈ ప్రక్రియ 14వ తేదీ వరకు ఉండే అవకాశం ఉందని, వినియోగదారులు అనుసంధానం చేసుకోవాలని దుబ్బాక విద్యుత్ ఏఈ రామాంజనేయులు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

హుస్నాబాద్: హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ బదిలీ అయ్యారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ టి.మల్లికార్జున్‌ను హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేసినట్లు మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఉత్తర్వులు జారీచేశారు.

హైదరాబాద్ తరలిన నేతలు

గజ్వేల్‌రూరల్: హైదరాబాద్‌లో జరుగుతున్న ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జాతీయ సమావేశానికి గజ్వేల్ నుంచి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్‌ఎఫ్ నేతలు మంగళవారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణమాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పర్శ రాములు, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై చర్చించే ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించడమే తమ అంతిమ లక్ష్యమన్నారు.

గుజరాత్‌కుకు జిల్లా జట్టు పయనం



జిల్లా జట్టుతో క్రీడాశాఖ అధికారి నాగేందర్

సిద్దిపేటజోన్: ఈనెల16వ తేదీ నుంచి 19 వరకు గుజరాత్ రాష్ట్రంలో జరిగే జాతీయ అంతర్ జిల్లా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ టోర్నీలో ఆడేందుకు సిద్దిపేట జిల్లా జట్టు మంగళశారం బయలుదేరింది. క్రీడాకారులను జిల్లా క్రీడాశాఖ అధికారి నాగేందర్, జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి రామేశ్వర్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట్ స్వామి అభినందించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. వీడ్కోలు పలికిని వారిలో పీఈటీలు కనకారెడ్డి, వెంకట్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సిద్దిపేటజోన్: ఈనెల 17, 18 తేదీల్లో గోదావరిఖనిలో జరగనున్న బీఎమ్మెస్ రాష్ట మహాసభలను జయప్రదం చేయాలని అఖిల భారత బీడీ కార్మిక సంఘ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం దేశాయ్ బీడీ ఫ్యాక్టరీ వద్ద మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఆరోపించారు.

మరుగుదొడ్ల నిర్వాహణపై పట్టింపేది

దుబ్బాక: మరుగుదొడ్ల నిర్వహణ పట్టించుకోకపోవడంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. నిర్మి ంచినా ఉపయోగంలేకుండా పోయింది. దు బ్బాకలోని అంగడి బజార్‌లో ప్రజల రద్దీ, మున్సిపల్ దుకాణ సముదాయలను దృష్టిలో ఉంచుకొని పురుషుల కోసం టాయిలెట్లను నిర్మించారు. గత నెలలుగా మున్సిపల్ అధికారులు వాటి నిర్వాహణ పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి టాయిలెట్లను వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు



నిలిచిన మలవ్యర్థాల శుద్ధి కేంద్రం

నిలిచిన అభివృద్ధి పనులు

నిధుల మంజూరులో ఆటంకం
- చేసిన పనుల బిల్లులపై ఆయోమయ పరిస్థితి
- పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్లు

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రారంభమైన అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. కొత్త ప్రభుత్వంలో పెండింగ్ పనులకు బిల్లులో ఎప్పుడు వస్తాయో తెలియక కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు.

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రారంభమైన ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు, మున్సిపల్ నూతన భవనం, మల వ్యర్థాలు శుద్ధిచేసే కేంద్రం, వెజ్, నాన్ వెజ్ సమీకృత మార్కెట్, ఎల్లమ్మ దేవాలయం గోపురం పనులు నిలిపివేశారు. హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులకు పర్యాటక శాఖ రూ.3 కోట్లు మంజూరు చేసింది. గత ఏడాది బతుకమ్మ పండుగ కోసం చెరువు కట్టపై బతుకమ్మ విగ్రహంతో పాటు బతుకమ్మ ఆడేందుకు ఏర్పాట్లు చేశారు. అప్పటికే విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేస్తుండగానే కొత్త ప్రభుత్వం పనులు నిలిపివేయాలని ఆదేశించడంతో ఉన్న స్తంభాలను కాంట్రాక్టర్ తీసుకెళ్లాడు. దీంతో పనులు నిలిచిపోయాయి. మున్సిపల్ కొత్త భవనం కోసం రూ.3 కోట్లు మంజూరు చేయగా ఫస్ట్ ఫ్లోర్ స్లాబ్ వరకు పూర్తి చేశారు. మిగిలిన పనులకు మరో రూ.2 కోట్లు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపారు. మున్సిపల్ అభివృద్ధి కోసం గత ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేయగా, ఈ నిధుల నుంచి అసంపూర్తిగా ఉన్న మున్సిపల్ కొత్త భవనం నిర్మాణం కోసం రూ.2 కోట్లు కేటాయించారు. టెండర్ ప్రక్రియ కొనసాగుతుండగానే ఎన్నికల కోడ్ రావడంతో టెండర్ ప్రక్రియను నిలిపివేశారు. ప్రస్తుతం నిధులు లేక మున్సిపల్ భవనం పనులు నిలిపివేశారు.

పిల్లర్లకే పరిమితం

హుస్నాబాద్ పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయం స్థానంలో కొత్తగా వెజ్, నాన్ వెజ్ సమీకృత మార్కెట్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసింది. ఈ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పిల్లర్ల వరకు నిర్మాణం చేపట్టారు. అలాగే ఎల్లమ్మ దేవాలయం గోపురం కోసం గత ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసింది. టెండర్లు పూర్తి చేసి, ఆలయ సమీపంలో ఉన్న షెడ్లను పూర్తిగా తొలగించారు. పనులు ప్రారంభించేలోపే గోపురమే కాకుండా, దేవాలయాన్ని కొత్తగా నిర్మించాలని ఎండోమెంట్ అధికారులు వచ్చి కొలతలు తీసుకొని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఉన్న గోపురం పనులు కూడా నిలిపి వేశారు. అలాగే ఎల్లమ్మ చెరువు మత్తడి సమీపంలో మల వ్యర్థాలు శుద్ధి చేసే కేంద్రం నిర్మాణ పనులకు రూ.కోటి మంజూరు కాగా పనులు ప్రారంభించారు. బిల్లులు రావడం లేదని సదరు కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. పైన పేర్కొన్న పనులకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా, కొత్త ప్రభుత్వంలో నిధులను ఆపివేయడంతో అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

నిబంధనలు పాటించాలి

గజ్వేల్‌రూరల్: ప్రయాణికులు, వాహనదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి సు రక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని గజ్వే ల్ ఎంవిఐ కవిత పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా మంగళవారం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద వాహనాదారులకు గులాబీ పూలు ఇస్తూ నిబంధనలు పాటించాలని అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహ నదారులు హెల్మెట్ పెట్టుకోవాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలన్నా రు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, మద్యం తాగి వాహనాలు నడపడం, రాంగ్‌రూట్, ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రమాదాలు జరుగుతాయన్నారు.

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదాల నివారణకు



గజ్వేల్‌లో గులాబి పూవ్వు ఇస్తూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ కవిత

అందరూ కృషి చేయాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ కోరారు. మండల పరిధి దుద్దెడ శివారు టోల్ ప్లాజా వద్ద భద్రతామాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, ఆర్టీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువకుడి రిమాండ్

కొండపాక(గజ్వేల్): గంజాయి విక్రయించడానికి తీసుకెళ్తున్న యువకుడిని పట్టుకొని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు త్రీటౌన్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లికి చెందిన సార్ల మహేష్ గంజాయి తాగడానికి అలవాటు పడ్డాడు. గంజాయిని విక్రయిస్తే డబ్బు సంపాదించొచ్చని హైదరాబాద్‌లోని దూల్‌పేటలో తెలిసిన వారి నుంచి గంజాయి తీసుకున్నాడు. దీనిని సిద్దిపేటలో విక్రయించడానికి తీసుకెళ్తున్న క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దుద్దెడ శివారులో పట్టుకున్నారు. అతడి నుంచి 24 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చైల్డ్ హెల్ప్‌లైన్ పై అవగాహన

సిద్దిపేటరూరల్: మండల పరిధి పెద్దలింగారెడ్డి పల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో డీసీపీయూ ఆధ్వర్యంలో చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098పై మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ విద్యార్థులకు చైల్డ్ రైట్స్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, వ్యక్తిగత అవగాహన, బాలకార్మికులు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. 0 నుండి 18 సంవత్సరాల వయస్సు గల బాలబాలికల రక్షణకోసం 1098 పనిచేస్తుందన్నారు.

ఆపన్నహస్త మిత్రబృందం సేవలు అభినందనీయం

గజ్వేల్‌రూరల్: ఆపన్నహస్త మిత్రబృందం సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, గజ్వేల్ ఏసీపీ రమేష్‌లు అన్నారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కూరగాయల మార్కెట్‌లో ఆపన్నహస్త మిత్రబృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఏసీపీ రమేష్ రక్తదానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నిరుపేదలకు, అనారోగ్యం బారిన పడిన వారిని అక్కున చేర్చుకుంటూ వారికి ఆర్థిక సాయమందించడమేగాకుండా, మనోధైర్యం కల్పిస్తూ సమాజంలో వినూత్న కార్యక్రమాలను చేపడుతూ ఆపన్నహస్త మిత్రబృందం సభ్యులు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఇలాంటి బృహత్కరమైన కార్యక్రమంలో తమల్ని భాగస్వాములను చేయడం సంతోషంగా ఉందన్నారు. రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు.

కార్మిక సమ్మెను విజయవంతం చేయండి

హుస్నాబాద్: కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ పిలుపునిచ్చారు. కేంద్రం ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేఖంగా జరుగుతున్న సమ్మె నోటీస్‌ను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, కమిషనర్ రాజశేఖర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాయింట్ కార్మిక సంఘాలు, వివిధ రంగాల ఉద్యోగ సంఘాలు, అఖిల భారత ఫెడరేషన్లు, సంయుక్త కిసాన్ మోర్చా ఈ నెల 16వ తేదీన ొరి్మకుల సమ్మెతో పాటు గ్రామీణ భారత్ బంద్ పాటించాలని నిర్ణయించామన్నారు.

చేర్యాల(సిద్దిపేట): ఈనెల 16వ తేదీన తలపెట్టిన



సమ్మె నోటీస్ ఇస్తున్న కార్మికులు

కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్ మావో, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శోభ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం సమ్మె నోటీసును మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్‌కు అందజేశారు.

ముందస్తుగా జీవాలకు టీకాలు వేయించాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): జీవాలకు ప్రభుత్వం అందించే ఉచిత టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్య సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్ బాబు సూచించారు. మండల కేంద్రమైన జగదేవ్‌పూర్ గ్రామంలో మంగళవారం తల్లి వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మండల పశువైద్యాకారిని శ్వేతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగజీవాలకు ముందస్తుగా టీకాలు వేయిస్తే చాలా వరకు వాధ్యులు నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగుతందన్నారు. కార్యక్రమంలో వీఏ శ్రీనివాస్, ఓఎస్ హరిప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

జీవాలను జాగ్రత్తగా చూసుకోవాలి

మద్దూరు(హుస్నాబాద్): అంటువ్యాధులబారిన పడకుండా గొర్రెలు, మేకలను జాగ్రత్తగా చూసుకోవాలని జాలపల్లి ఎంపీటీసీ చెట్కూరి కల్యాణి



జీవాలకు టీకా వేస్తున్న సబ్బంది

అన్నారు. మండలంలోని జాలపల్లి గ్రామంలో జీవాలకు అమ్మతల్లి, బొబ్బ రోగం సోకకండా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధికి కారణమైయ్యే దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే ఉచిత టీకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎంపీటీసీలంటే ఉత్సవ విగ్రహాలేనా?

- సమాచారం ఇవ్వడంలేదని ఆగ్రహం
- ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం



సీడీపీఓ జయమ్మను ప్రశ్నిస్తున్న ఎంపీపీ మాలోతు లక్ష్మీ

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎంపీటీసీ సభ్యులంటే ఉత్సవ విగ్రహాలేనా? గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు కనీస సమాచారం ఇవ్వట్లేదు, నాలుగున్నరేళ్లలో ఒక్కసారైనా అంగన్‌వాడీ సెంటర్‌లో జరిగిన కార్యక్రమాలకు మమ్మల్ని ఎందుకు ఆహ్వానించడం లేదని సీడీపీఓ జయమ్మపై ఎంపీటీసీ సభ్యులంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కన్నపేట మండల కేంద్రంలో మంగళవారం ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాలోతు లక్ష్మీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభలో ఎంపీటీసీలు కూడా ప్రజల చేత ఎన్నుకోబడిన వారేనని ఎంపీటీసీ సభ్యులు సాంబరాజు, శ్రీనివాస్, ప్రమీల, స్వప్న సభ దృష్టికి తీసుకెళ్లారు. పొద్దుతిరుగుడు సాగుకు పుటినిల్లు కట్కూర్ గ్రామమని, కట్కూర్‌లో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని తీర్మానం ప్రవేశపెట్టగా గుడాటిపల్లి గ్రామ ఎంపీటీసీ బైరి రవి బలపరించారు. అదేవిధంగా రైతుబంధు డబ్బులు మూడు ఎకరాల వరకు పడలేదని, దీంతో రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఎంపీటీసీ సాంబరాజు ప్రస్తావించారు. పశువైద్యాధికారులు గ్రామాలకు రావడంలేదని, మూగజీవాలకు సకాలంలో వైద్యం అందక చనిపోతున్నాయని సభలో పశువైద్యాధికారులను ఎంపీటీసీలు నిలదీశారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స కూడా కరువైందని, ఇక్కడి వైద్య సిబ్బంది నిత్యం సెల్‌ఫోన్‌లో కాలక్షేపం చేస్తున్నారని, ఆసుపత్రికి వచ్చే రోగులను పట్టించుకోవడంలేదని ఎంపీటీసీ సభ్యులు సాంబరాజు సభ దృష్టికి తెచ్చారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ఏదైనా ప్రభుత్వ కార్యక్రమాలు చేస్తే తప్పకుండా ఎంపీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శంకరయ్య, తహసీల్దార్ ఇంజమూరి సంజీవ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విధానాలను ఎండగడతాం

- రాజకీయ లబ్ధికోసమే కాళేశ్వరం పర్యటన
- అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో తెలంగాణకు మరోసారి అన్యాయం జరిగే అవకాశముందని, ఈ దుస్థితికి అడ్డుకట్ట వేయడానికి బీఆర్‌ఎస్ ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నదని అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం నల్గొండలో కేసీఆర్ సభకు తరలివెళ్తూ గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ కృషి ఫలితంగా తెలంగాణ ఇప్పుడిప్పుడే సస్యశ్యామలమవుతుండగా, కృష్ణా జలాలపై ఆధిపత్యాన్ని కేంద్రానికి అప్పగించే నిర్ణయం ద్వారా ఈ ప్రాంతానికి తీరని అన్యాయాన్ని తలపెట్టేందుకు కాంగ్రెస్ యత్నిస్తున్నదని మండిపడ్డారు. ఈ దుస్థితిని ప్రజల్లో ఎండగడతామని హెచ్చరించారు. రాజకీయ లబ్ధి కోసం బీఆర్‌ఎస్ సభ జరుగుతున్న రోజే కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు కాళేశ్వరం ప్రాజెక్ట్ సందర్శనకు బయలుదేరడం విడ్డూరంగా ఉందన్నారు. కాళేశ్వరం అంటే ఒక్క మేడిగడ్డ ప్రాజెక్ట్ మాత్రమే కాదని, దీని పరిధిలో 147 టీఎంసీల సామర్థ్యం కలిగిన 19 రిజర్వాయర్లు ఉన్నాయన్నారు. 618 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోస్తున్న ప్రపంచంలో అత్యంత గొప్ప ఎత్తిపోతల పథకమని తెలిపారు. బీఆర్‌ఎస్‌పై బురద చల్లే కుట్రలోభాగంగానే కాంగ్రెస్ కాళేశ్వరం పర్యటన జరుగుతుందనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు.

చేర్యాల(సిద్దిపేట): కృష్ణా జలాల్లో తెలంగాణ



నల్లగొండ బయలుదేరిన అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

హక్కుల పరిరక్షణ కోసం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండలో తలపెట్టిన బహిరంగసభకు బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివెళ్లాయి. తరలిన వారిలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు తదితరులున్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): నల్లగొండలో చేపట్టిన బీఆర్‌ఎస్ భారీ బహిరంగ సభకు మంగళవారం చిన్నకోడూరు మండలం నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. వెళ్లిన వారిలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు నల్లగొండలో మాజీ సీఎం కేసీఆర్ నిర్వహించే బహిరంగసభలో పాల్గొనేందుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు నూనె కుమార్, ర్యాగల్ల దుర్గయ్య మాట్లాడారు. కృష్ణానది జలాలపై నీటి హక్కులను కేంద్ర ప్రభుత్వానికి అప్పగించడం తగదన్నారు. నీటి హక్కులను కాపాడుకోవడానికి కేసీఆర్ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉచిత శిక్షణతో పేద విద్యార్థులకు ప్రయోజనం

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో పీజీసెట్, జామ్ తదితర పోటీ పరీక్షల ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ ఉచిత శిక్షణతో పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కెమిస్ట్రీ విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాసం శ్రీనివాస్ మాట్లాడుతూ 40 రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. 65 మంది విద్యార్థులు శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లోని నిపుణులైన అధ్యాపకులతో పాటు వరంగల్ ఎన్‌ఐటీ ప్రొఫెసర్లతో శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్‌ను సైతం అందించనున్నట్లు వివరించారు. కోర్సు కన్వీనర్లు ఆంజనేయులు, సలీంపాషా మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులకు మాత్రమే పరిమితం అనుకున్న ఎన్‌ఐటీ, ఐఐటీ సంస్థల్లో జాయింట్ అడ్మిషన్ టెస్ట్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్

ఫర్ మాస్టర్స్(జామ్) ద్వారా డిగ్రీ పూర్తయిన విద్యార్థులు ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చేసే అవకాశం లభిస్తుందన్నారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలతో పాటు దేశంలోని సెంట్రల్ యూనివర్సిటీల్లో కూడా పీజీ కోర్సులు చేసేందుకు ఈ శిక్షణా కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల పరీక్షల కంట్రోలర్ డాక్టర్ గోపాల సుదర్శనం, పీజీ కోర్డినేటర్ డాక్టర్ అయోధ్యరెడ్డి, అయా విభాగాల అధిపతులు డాక్టర్ పల్లవి, డాక్టర్ రాణి, డాక్టర్ మల్లేశం, శ్యాంసుదర్ పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధి ధర్మాజీపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా అభినవ్, డీఈఓగా ప్రభు, ఉపాధ్యాయులుగా తదితరలు వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన వారికి హెచ్‌ఎం శ్రీనివాస్ బహుమతులు అందజేశారు.

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని చిట్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమాన్ని హెచ్‌ఎం కాయిత సంతోష్‌రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంకిషన్, నవిత, నర్సింహులు, సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మాయమాటలతో కాంగ్రెస్ మోసం

తొగుట(దుబ్బాక): మాయమాటలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి ఆరోపించారు. బీఆర్‌ఎస్ చేపట్టిన చలో నల్లగొండ బహిరంగసభకు మండలం నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు మంగళవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించబోమని కాంగ్రెస్ ప్రభుత్వం తీర్మానం చేయడం ప్రజల విజయమన్నారు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ కొమురయ్య, రాంరెడ్డి, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు అరుణ్ కుమార్, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

◆ జాతీయ అవార్డు గ్రహీతకు ఘన సన్మానం

బెజ్జంకి(సిద్దిపేట): ఈనెల 11వ తేదీన తిరుపతిలో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో డాక్టర్ రాధాకృష్ణ జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన రామంచ రవీందర్‌ను అందజేశారు. ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం బెజ్జంకి బాలుర ఉన్నత పాఠశాలలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్, డీటీఎఫ్, ఎస్టీయూ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ కేసుల పరిష్కారం

గజ్వేల్‌రూరల్: సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే కేసులను త్వరగా ఛేదించేందుకు దోహదపడతాయని గజ్వేల్ సీఐ సైదా పేర్కొన్నారు. మండల పరిధిలోని రిమ్మనగూడ గ్రామంలో గ్రామస్తుల సహకారంతో నేర్పాటుచేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ వైభవంగా ఆలయ వార్షికోత్సం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అనంతసాగర్ సరస్వతీ క్షేత్ర ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి పల్లకి సేవ తదితర పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

◆ బీసీ సంక్షేమ సంఘం ప్రచార కార్యదర్శిగా నర్సాగౌడ్

హుస్నాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా పెరుమాండ్ల నర్సాగౌడ్‌ను నియమిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి గొర్ల అయిలేష్ యాదవ్ మంగళవారం తెలిపారు. హుస్నాబాద్‌లో నర్సాగౌడ్‌కు నియమాక పత్రం అందజేసి అభినందించారు. బీసీల హక్కుల కోసం బీసీలను చైతన్యవంతులను చేస్తూ ఉద్యమించాలని సూచించారు.

◆ ఆటలో గెలుపు ఓటములు సహజం

కోహెడరూరల్(హుస్నాబాద్): ప్రతీ ఆటలో గెలుపు ఓటములు సహజమని, వాటిని క్రీడా స్ఫూర్తితో తీసుకొని ముందుకు సాగాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య అన్నారు. మంగళవారం మండలంలోని బస్వాపూర్ గ్రామంలో మండల స్థాయిలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి పోరెడ్డిపల్లి, ద్వితీయ బహుమతి బస్వాపూర్ జట్టు కైవసం చేసుకున్నాయి.

◆ క్రీడాకారుడికి ఆర్థిక సాయం

మిరుదొడ్డి(దుబ్బాక): గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో ఈ నెల 16 నుంచి 19 వరకు జరిగే 19వ జూనియర్స్ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ షాట్ పుట్ అండర్ 16వ విభాగంలో అక్బర్‌పేట-భూంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి రమేష్ ఎంపికయ్యాడు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సోమవారం అతడిని అభినందిస్తూ రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. రమేష్‌ను పీఈటీ తోట వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఉల్లెంగెల నవ్య అభినందించారు.

◆ సేవాలాల్ జయంతిని విజయవంతం చేయండి

హుస్నాబాద్: ఈనెల 15వ తేదీన నిర్వహించే గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని విజయవంతం చేయాలని గిరిజన సంఘాల నాయకులు కోరారు. మంగళవారం హుస్నాబాద్‌లో జయంతి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతున్నట్లు తెలిపారు.

◆ ఆర్థిక సహాయం

సిద్దిపేటఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలకు అనుబంధంగా కొనసాగుతున్న సెల్ఫ్ మేనేజ్ మెంట్ హాస్టల్ (ఎస్‌ఎంహెచ్) 1999-20 బ్యాచ్ విద్యార్థులు పేదింటి యువతి వివాహానికి అండగా నిలిచారు. సిద్దిపేటకు చెందిన ముత్యాల భారతి హాస్టల్‌లో వంట కార్మికురాలిగా పనిచేస్తోంది. ఆమె కూతురు ప్రత్యూష వివాహం మంగళవారం శ్రీకాంత్‌తో జరిగింది. భారతి కూతురు వివాహ నిమిత్తం రూ.లక్ష అందజేశారు.